



విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

మెట్‌పల్లి టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు గురువారం మెట్‌పల్లి లయన్స్ క్లబ్ సభ్యులు పరీక్ష సామగ్రిని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గుండా రాకేష్, నాంపల్లి వేణుగోపాల్, రఘుపతిరావు, మహాజన శివకుమార్ పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆదర్శ పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి 6వ తరగతి ప్రవేశ పరీక్ష, 7,8,9,10 తరగతుల్లో ఖాళీ సీట్లకు విద్యార్థుల నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 20న పరీక్ష ఉంటుందన్నారు. ప్రవేశాల కోసం విద్యార్థులు వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తులు సమర్పించాలన్నారు. ఓసీలు రూ.200, ఎస్సీ, ఎస్టీ, ఇడబ్ల్యూఎస్, దివ్యాంగులు, బీసీ విద్యార్థులు రూ.125 చెల్లించాలని డీఈవో రాము ప్రకటనలో తెలిపారు.

స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మల్యాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): స్పీకర్ గడ్డం ప్రసాద్‌రావుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికాదని మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శనిగారపు తిరుపతి పేర్కొన్నారు. ఉన్నతంగా ఉన్నటు వంటి దళిత నాయకులపై బీఆర్ఎస్ నేతలు చులకన భావం వీడనాడలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో దళితులపై అనేక దాడులు చేశారన్నారు. దళితుడిని సీఎం చేస్తానని మోసం చేశారని ఆరోపించారు. జగదీష్‌రెడ్డి సస్పెన్షన్ సమర్థనీయమేనని అన్నారు.

బస్సు సౌకర్యం పునరుద్ధరించాలి

రాయికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దావన్‌పెల్లికి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని మాజీ సర్పంచ్ రెబ్బాసు మల్లయ్య గురువారం డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. గతంలో ఆర్టీసీ బస్సు నాలుగు ట్రిప్పులు నడిచేదని, దానిని బంద్ చేశారన్నారు. బస్సును రాయికల్, భూపతిపూర్, ఒడ్డెలింగాపూర్ మీదుగా నడిపించాలని కోరారు.

కొడిమ్యాల వాగుకు నీటిని వదలాలి

కొడిమ్యాల, మార్చి13(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతారం పెద్ద చెరువు నుంచి కొడిమ్యాల పెద్ద వాగుకు నీటిని వదిలి పెట్టాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంను, నీటి పారుదల శాఖ అధికారులను వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహా మండలి మాజీ సభ్యుడు వెల్మల రాంరెడ్డి కోరారు. నెల రోజుల క్రితం పోతారం చెరువు నుంచి నీటిని వదిలి పెట్టడంతో వాగు పక్క గ్రామాల చెక్ డ్యాంలు నిండాయి. వ్యవసాయ బావులు, బోర్లలో నీటి మట్టం పెరిగింది. వరి పొలాలకు నీరందింది. ప్రస్తుతం వరి పొలాలు ఎండిపోయే పరిస్థితి ముందు ఉన్నందున పొలాలు ఎండిపోక ముందె పోతారం చెరువు నుండి నారాయణపూర్ వరకు నీటిని వదిలినట్లయితె తమ పొలాలు ఎండి పోకుండా ఉంటాయని పలువురు రైతులు తెలిపారు.

పెరుగుతున్న సిజేరియన్లు



- జిల్లాలో నామమాత్రంగా సాధారణ ప్రసవాలు
- కాసుల వేటలో ప్రైవేట్ ఆసుపత్రులు
- కొరవడిన వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణ
- భవిష్యత్తులో మహిళల ఆరోగ్యంపై ప్రభావం

జగిత్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసవాలకు ఆసుపత్రులకు వెళితే ఎక్కువగా శస్త్ర చికిత్సలే చేస్తున్నారని ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు చెబుతున్నాయి. గర్భిణులకు సాధారణ కాన్పు చేయాలని ప్రభుత్వ ఆదేశాలున్నా పలు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆపరేషన్లు చేస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడి ఎక్కువ శాతం ఆపరేషన్ల ద్వారానే ప్రసవాలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆపరేషన్ల ద్వారా ప్రసవాలు చేయడంతో మహిళలు భవిష్యత్తులో పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సరియైన కారణం లేకుండా శస్త్ర చికిత్సలు చేస్తే నోటీసులు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు న్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఒక్కో శస్త్ర చికిత్సకు రూ.50 వేల నుంచి రూ.1.20లక్షల వరకు వసూలు చేస్తున్నారు.

జిల్లాలో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 ఫిబ్రవరి 28 వరకు ప్రసవాల వివరాలు ఇలా..

ఆసుపత్రులు	మొత్తం	ఆపరేషన్లు	సాధారణం
ప్రైవేటు	5,612	4,809	803
ప్రభుత్వ	4,982	3,426	1,556
మొత్తం	10,594	8,235	2,359

జిల్లాలో పరిస్థితి ఇలా...

జిల్లా వ్యాప్తంగా ఒక ప్రధాన ఆసుపత్రి, ఒక మాతా శిశు సంరక్షణ కేంద్రం, 4 తెలంగాణ వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులు, 19 ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, 151 ఆరోగ్య ఉప కేంద్రాలు, 24 గంటలు పనిచేసే 9 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 5 పట్టణ ఆరోగ్య కేంద్రాల ద్వారా ఆరోగ్య సేవలను ప్రభుత్వం అందిస్తోంది. వీటికి తోడు సుమారు 300 వరకు ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయి.

జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో 80 శాతం సిజేరియన్లు చేస్తున్నారు. సాధారణ ప్రసవం చేస్తే వైద్యులకు ఎక్కువ డబ్బులు రావన్న కారణంతో కొంత మంది సిజేరియన్లు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. సాధారణ ప్రసవంలో కొన్నిసార్లు బిడ్డ మెడకు పేగులు పెనవేసుకోవడం, విరేచ నం మింగడం, ప్రాణ వాయువు అందక పోవడం వంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయన్న అభిప్రాయాలతో శస్త్ర చికిత్సలను వైద్యులు ప్రోత్సహిస్తున్నారన్న విమర్శలున్నాయి. ప్రస్తుతం అధునాతన వైద్యం అందుబాటులోకి వచ్చినప్పటికీ

మిగతా 8వ పేజీలో

సాధారణ ప్రసవాలతో ప్రయోజనాలు

సాధారణ ప్రసవాల్లో మహిళలు రెండు రోజుల్లోనే ఎప్పటిలా పనులు చేసుకోవడానికి వీలుంటుంది. రెండో కాన్పుపై దుష్ప్రభావం ఉండదు. గర్భసంచికి ప్రమాదం ఉండదు. భవిష్యత్తులో రుగ్మతలకు గురికాకుండా సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారు. పుట్టిన బిడ్డకు సైతం మొదటి గంటలో తల్లి పాలు అందించవచ్చును. తద్వారా ఇటు తల్లికి అటు బిడ్డకు మంచి ఆరోగ్య అందే అవకాశాలుంటాయి. ఒక వేళ ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అయితే ప్రోత్సాహక నగదు సైతం అందుతుంది.


మాతా శిశు సంరక్షణ కేంద్రం

ధర్మపురి క్షేత్రంలో భక్తజన సందడి
● వేంకటేశ్వర స్వామివారల ఊరేగింపు
7

కొండగట్టులో గిరి ప్రదక్షిణ
● కొండ చుట్టూ 5.7కి.మీల మేర నడకమార్గం
● అభివృద్ధికి సొంత డబ్బులు అందించిన మంత్రి పొన్నం
● పూర్తయిన పనులు
7

నేడు హోలీ

వెల్గటూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా శుక్రవారం హోలీ వేడుకలు జరుపుకోనున్నారు. ప్రతీ ఏటా ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున హోలీ పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రసాయన రంగులు నిషేధించాలని పర్యావరణ వేత్తలు కోరుతున్నా అది అమలుకు నోచు కోవడం లేదు. సహజసిద్ధమైన రంగులనే ఉపయోగించి ఆరోగ్యకర వాతా వరణంలో హోలీ జరుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

రసాయన రంగులతో హాని

మార్కెట్‌లో లభించే రసాయన రంగుల వాడకంతో చర్మం దెబ్బతినే అవకాశాలు ఎక్కువ. రసాయన రంగులలో కాపర్ సల్ఫైడ్, మెర్క్యూరీ సల్ఫైడ్, అల్యూ మినియం బ్రోమైడ్, లెడ్ ఆక్సైడ్, వంటి రసాయనాలు ఉంటాయి. అవి మన శరీరానికి హానిని కలుగజేస్తాయి.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఎస్పీ అశోక్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): హోలీ పండుగను ప్రశాంత వాతావరణం లో జరుపుకోవాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. హోలి పండుగను పురస్క రించుకుని పోలీస్ అధికారులతో ఎస్పీ గురువారం జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపవద్దని కోరారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలతో పాటు వాహనాల తనిఖీలు చేపట్టనున్నట్లు వివరించారు. హోలీ వేడుకలు ముగిసిన తర్వాత స్నానాలు ఇంటి వద్దనే చేయాలని సూచించారు. చెరు వులు, కుంటలు, వాగులు, కాలువల ప్రాంతాల వద్దకు వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. పండుగ సందర్భంగా ఇతరులపై బలవంతంగా రంగులు చల్లడం,మహిళలను వేధింపులకు గురి చేస్తే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

త్వరలో డబుల్ రూం ఇళ్లలో మౌలిక వసతులు

ఎమ్మెల్యే సంజయ్ కుమార్


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణ పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లలో త్వరలో మౌలిక వసతులు కల్పించి లబ్ధిదారులకు అప్పగిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. గురువారం నూకపెల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ళ వద్ద నిర్మిస్తున్న నీలి ట్యాంకులు, మరుగు దొడ్లు, ఇతర వసతుల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. నూకపెల్లిలోని 45 వందల డబుల్ బెడ్‌రూం ఇళ్ళకు సరాఫరా కోసం 14 లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న నీటి ట్యాంకు, మిషన్ భగీర్థ పాత నీటి ట్యాంకుల ద్వారా లబ్ది చేరనుందన్నారు. త్వరలో వసతులు కల్పించి లబ్దిదారులకు ఇళ్ళను అప్పగిస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అడువాల జ్యోతి, పున్సిపల్ కమీషనర్ చిరంజీవి, కాంగ్రెస్ నాయకులు దామోదర్‌రావు, క్యాదాసు నవీన్, బిక్షపతి ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

జగిత్యాల పట్టణంలో 29, 30వ వార్డులలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం పరిశీలించారు. రూ. 5 లక్షలతో నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణం పనులను, పట్టణంలోని న్యూ హైస్కూల్‌లో నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించి పనులు త్వరగా పూర్తి చేయమని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గిళి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు తోట మల్లికార్జున్, పంబాల రాంకుమార్, బొడ్ల జగదీష్, కూతురు రాజేష్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, రాజ్‌కుమార్, ధర్మరాజు, రాంమోహన్ రావు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :సైబర్ నేరాలు, భద్రతపై ప్రతి ఒక్కరకి అవగాహన తప్పనిసరని సైబర్ క్రైం డీఎస్పీ రంగారెడ్డి పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియాతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ఆన్‌లైన్ మోసాలకు పాల్పడే విధానాన్ని వివరించారు. మహిళల హక్కులు, రక్షణకు షీటీంలు ప్రత్యేకంగా పని చేస్తున్నాయ న్నారు. విద్యార్థినులను వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కృష్ణ గౌడ్, ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ తదితరులు ఉన్నారు. అలాగే ట్రాఫిక్ శిక్షణ కేంద్రంలో పట్టణంలోని శ్రీనిధి ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ , సీట్ బెల్ట్ ప్రాముఖ్యత తదితర అంశాలపై ట్రాఫిక్ ఎస్సై మల్లేశం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరణ్

రాయికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జాబ్ కార్డులు కలిగిన కూలీలందరూ ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి పొందాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రఘువరణ్ అన్నారు. రాయికల్ మండలంలోని వీరాపూర్‌లో జరుగుతున్న ఉపాధిహామీ పనులను గురువారం ఆయన పర్యవేక్షించారు. ఉపాధి హామీ పనిచేస్తున్న కూలీల హాజరు నమోదు వివరాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభి వృద్ధి చెందాలన్నారు. వేసవి కాలం దృష్ట్యా పని ప్రదే శంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలి క వసతుల కల్పనతో పాటు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కూలీలు చేసిన పనులకు సంబంధించిన కొలతలను పరిశీలించారు. ఎం డల తీవ్రత దృష్ట్యా ఉదయం త్వరగా పనులకు రావా లని కూలీలకు సూచించారు. జగిత్యాల జిల్లాలో మార్చి 31 వరకు 4 లక్షల పని దినాలు చేయాలని టార్గెట్ ఉందని, జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులకు రావాలన్నారు. ఫారం పాండ్, నీటి నిల్వ కందకాలు, పర్క్యులేషన్ ట్యాంక్, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నర్సరీని సందర్శించి మొక్కల పెంపకంలో వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సుష్మా, ఏపీవో దివ్య, పంచాయతీ కార్యదర్శి స్వర్ణ, టెక్నికల్ అసిస్టెంట్ వీణా రాణి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, కారోబార్ ప్రశాంత్, గ్రామస్థులు, కూలీలు పాల్గొన్నారు.

కెపాసిటర్ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి

కోరుట్ల రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కెపాసిటర్ల వినియోగంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ గంగాధర్ అన్నారు. గురువారం కోరుట్ల మండలంలోని మాదాపూర్ గ్రామంలో 3/100 కేవీకి అదనపు ట్రాన్‌పార్మర్‌కు బిగించిన 100 కేవీ ట్రాన్ పార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు విద్యుత్ వినియోగంలో చోటు చేసుకొనే ప్రమాదా నివారణపై వివరించారు. రైతులు కెపాసిటర్లు బిగించుకొని విద్యుత్ శాఖకు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ ఆంజనేయరావు, ఏఈ శ్రీనివాస్‌లతో పాటు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

మార్చి19 లోగా అన్ని పార్టీల నాయకులతో సమావేశాలు పూర్తి చేయాలి

జగిత్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాలపై మార్చి 19వ తేదీలోగా అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య ఎన్నికల అధికారి ప్రతి మూడు నెలలకోసారి పకడ్బందిగా నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలని అన్నారు. ఓటరు జాబితా సవరణ, పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై వివిధ రాజకీయ నాయకులతో మార్చి 19 తేదీ లోపు సమావేశాలు పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశాంలో తప్పకుండా మినిట్స్ ఇతర వివరాలను ఎన్నికల కమీషన్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, నియోజక వర్గాల స్థాయిలో రెవెన్యూ డివిజన్ అధదికారలు, తహసీల్దార్‌ల ఆధ్వర్యంలో పార్టీల ప్రతినిధుల సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఆర్డీఓలు మధుసూదన్, జివాకర్, రెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లు వేగవంతం చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్


కోరుట్లలో అధికారులను వివరాలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల/మెట్‌పల్లి టౌన్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఆర్ఎస్ ఫీజు వసూళ్లను వేగవంతం చేసి ఇంటి పన్ను వంద శాతం వసూలు అయ్యే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర సత్యప్రసాద్ అన్నారు. గురువారం కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలలోని మున్సిపల్ కార్యాలయంతో పాటు పట్టణ శివారులో నిర్మాణం చేస్తు న్న అర్బన్ హెల్త్ కేంద్రంను పరిశీలించారు. పట్టణంలోని వివిధ వ్యాపార సంస్థల యజమానులను కలిసి ఇంటి పన్నుతో పాటు ఎల్ఆర్ఎస్‌పై వివరించారు. ప్రభుత్వ విధించిన గడువులోపు ఎల్ఆర్ ఎస్ ఫీజును కట్టి ప్రభుత్వానికి సహకారం అందించాలని అన్నారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి ఎల్ఆర్ఎస్, ఇంటి పన్నుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల, మెట్‌పల్లి ఆర్‌డీఓలు జీవాకర్ రెడ్డి, శ్రీనివాస్, కోరుట్ల ఎంపీడీవో, మున్సిపల్ ఇన్‌చార్జు కమిషనర్ రామకృష్ణ, మెట్‌పల్లి కమిషనర్ మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మైనార్టీ గురు కుల రెసిడెన్షియల్ స్కూల్ అండ్ జూని యర్ కళాశాలలో(బాలికల) విద్యార్థులు డ్రా యింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సి పాల్ సుచిత్ర తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివే విద్యార్థులు విద్యతో పాటు కళల్లో సైతం ముందు వరుసలో ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు.

పాఠశాల కు చెందిన డ్రాయింగ్ టీచర్ హవీలా వీణాధరి శిక్షణతో జనవరిలో జరిగిన లోయర్ గ్రేడ్ పరీక్షకు తమ విద్యార్థులు హాజరయ్యారని, ఇందులో 18మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్ విత్ డిస్టింక్షన్, 8మంది విద్యార్థులు సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో పాటు డ్రాయింగ్ టీచర్‌ను మైనార్టీ గురుకుల ఆర్ఎల్‌సీ రాజేందర్, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ సుచిత్రతో పాటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు అభినందించారు.

ధర్మపురి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా రవీందర్

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా జక్కు రవీందర్ ఎన్నికయ్యారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ కరీంనగర్ అసిస్టెంట్ కమీషనర్ నాయిని సుప్రియ 13 మంది సభ్యులు ఏదులాపురం మహేందర్, బాదినేని వెంకటేష్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, జక్కు రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేష్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంభంకాడి గణేష్‌కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్, ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులుతో పదవీ స్వీకార ప్రమాణం చేయించారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్, సభ్యులను వేదపండితుల బొజ్జ రమేష్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి ఆశీర్వదించారు.

ఆలయ అభివృద్ధికి కృషి : చైర్మన్ రవీందర్

ధర్మపురి దేవస్థానం అభివృద్ధి కోసం తన వంతు కృషి చేస్తానని ధర్మకర్తల మండలి నూతన చైర్మన్ జక్కు రవీందర్ తెలిపారు. చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తన ఛాంబర్‌లో విలేకరులతో మాట్లాడారు. తనకు ఈ పదవి రావడానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కృషి చేశారని ఆయన తెలిపారు.


కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ నాయిని సుప్రియ

మొల్లమాంబ జయంతి

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మహిళా కవయిత్రి కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలను జగిత్యాల పట్టణ కుమ్మరి సంఘం అధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లింగంపేట కుమ్మరి సంఘం భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో మొల్లమాంబ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సిరికొండ రమేష్, సంఘం గౌరవ అధ్యక్షుడు శంకరయ్య, జిల్లా వృత్తి సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మహిపాల్ ఉన్నారు.

గిరి ప్రదక్షిణ

వెల్గటూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి బ్రహ్మో త్సవాలలో భాగంగా గురువారం గిరి ప్రదక్షిణ వైభవంగా నిర్వహించారు. స్వామి వారి పల్లకీ సేవలో పాల్గొనడానికి భక్తులు ఉత్సాహం చూపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసులో నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం చింతకుంటలో ఫిబ్రవరి 5నజరిగిన గొడవకు సంబంధించి ఎస్సీఎస్టీ కేసునమోదుకాగా, నిందితులను గురువారం అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఐదుగురిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణీపేటలో అక్రమంగా ఓ ఇంటిలో నిల్వ ఉంచిన ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని జగిత్యాల టౌన్ పోలీసులు, సివిల్ సప్లయిస్ అధికారులు కలిసి పట్టుకున్నారు. పట్టణానికి చెందిన షేక్‌చాంద్ అనేవ్యక్తి రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టిస్తూ సొమ్ముచేసుకుంటున్నట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. తనిఖీల్లో ఓ ఇంటిలో దాచిన ఆరు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకుని సీజ్‌చేసి చాంద్‌పై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో టౌన్ ఎస్సై కిరణ్ కుమార్, డీటీ వర ప్రసాద్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి రిమాండ్

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గుర్రంమల్లయ్య తనను తన తమ్ముడు గుర్రంనారాయణ టీఎస్36 3186గల కారుతో ఆక్సిడెంట్‌చేసి చంపాలని ప్రయత్నించాడని డిసెంబరు 2, 2024లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేశవపట్నం పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేసి గురువారం నారాయణను అరెస్టు చేసి హుజూరాబాద్ కోర్టులో హాజరుపరిచారు. నారాయణకు కోర్టు 15రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై కొత్తపల్లి రవి తెలిపారు.

పంటలను కాపాడుకునేందుకు

అన్నదాతల అష్టకష్టాలు

- బావుల్లో పూడికతీత
- రైతుపై అదనపు భారం
- క్రేన్లకు పెరిగిన గిరాకీ

గంగాధర/సైదాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండి పోతున్నారు. వాటిని కాపా డుకునేందుకు రైతులు తిప్పలు పడుతు న్నారు. మెట్టప్రాంతాలైన గంగాధర, సైదా పూర్ మండలాల్లో 15 మీటర్లపైన తవ్వితే గాని నీరు పడదు. పలు గ్రామాల్లో 17 మీటర్లపైన తవ్వితే బండరాయి వస్తుం టుంది. వానకాలం పంటలకు సాగునీటికి ఇబ్బంది లేకున్నా యాసంగిలోనే తీవ్ర ఇబ్బందిపడు తుంటారు. యాసంగిలో ముంద స్తుగానే నాట్లు వేస్తున్నప్పటికి గొలక దశలో పంటలకు నీరందక రైతులు అరిగోస పడుతుంటారు. పంటలను కాపాడుకునేం దుకు పలువురు రైతులు బావుల్లో పూడిక తీతను చేపట్టారు. బావుల్లో మూడు గజాల లోతు తవ్వితే సుమారుగా మూడు లక్షల రూపాయలు ఖర్చవుతుంది. అయినా రైతులు అప్పులు చేసి పంటలను కాపాడుకునేందుకు బావు లను మరింత లోతు తవ్విస్తున్నారు. మరో ఇరవై రోజులు పొలానికి నీరందిస్తే చేతి కొస్తుందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం గొలక వేస్తుండగా అక్కడక్కడ పొలం పొట్టకు వచ్చింది. ఈ యాసంగిలో తెలుళ్ళు, చీడలు లేకపోవడంతో దిగుబడివస్తుందన్న నమ్మకంతో రైతులు అప్పులు చేసి బావుల్లో పూడిక తీయిస్తున్నట్లు తెలిపారు. బావుల్లో పూడిక తీసే క్రేన్లకు గంగాధరలో గిరాకీ ఎక్కువగానే ఉంది. భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతుండగా పంటను కాపాడుకునేందుకు పూడిక తీత క్రేన్ల కూలీల వద్ద క్యూ కడుతున్నారు.

● పైపుల ద్వారా పొలాలకు నీరు.

వ్యవసాయ బావుల్లో ఉన్న కొద్దిపాటి నీటిని పైపులు వేసి పారిస్తున్న ఫలితం శూన్యం. రైతన్న పంట పొలాలు దక్కించుకోవడం దిన దినంగా గండంగా మారింది. వందల ఎకరాల్లో పంట పొలాలు మరో 20రోజుల్లో చేతికందే సమయంలో ఎండిపోతున్నాయి. దీంతో ప్రతి గుంటకు పైపుల ద్వారా నీటిని పారిస్తున్నారు.



గంగాధర మండలం గర్షకుర్తిలో పూడిక తీస్తున్న కూలీలు

చేతికందే సమయంలో ఎండిపోతున్న వరి పొలం.

- భీంరెడ్డి అరుణ్‌రెడ్డి, రైతు, అమ్మనగుర్తి, సైదాపూర్ మండలం



నాకున్న మూడెకరాల్లో రెండెకరాలు సీడ్ వరి వేశాను. పంట చేతికచ్చే సమయంలో నీరు లేక పొలం ఎండిపోతుంది. వరి పొట్ట దశలో ఉంది. లక్షల రూపాయలు అప్పులు తెచ్చి బావిలో పూడిక తీసినా గంట సేపు కూడా మోటర్ పోయడం లేదు. ఎండుతున్న వరిని ఏం చేయాలో తెలియక ఆవులు, గేదెలకు మేతగా కోసి వేస్తున్నాను.

రూ. మూడు లక్షలు పెట్టి బాయి తవ్విస్తున్నా..

- పల్ల కుంటయ్య, రైతు, గర్షకుర్తి, గంగాధర మండలం



రెండున్నర ఎకరాల భూమిలో వరి సాగు చేసిన. రోజురోజు ఎండలకు బాయిల నీళ్ల అడుగంటినయి. బాయిల ఊరినవి ఊరినట్లు పెట్టుతున్న పొలానికి సరిపోవడం లేదు లేదు. పొలం చేసినందుకు మరింత ఖర్చు పెట్టి బండరాయిని తవ్విస్తున్న. పంట పండితే ఎప్పటికైనా బాకీ తీర్చుకోవచ్చు. మూడు గజాలు తవ్విస్తే మూడు లక్షల రూపాయల ఖర్చయింది.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి రాజీవ్ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. కరీంనగర్‌కు చెందిన ఆదూరి అభినవ్ జగిత్యాలకు చెందిన కోనూరు శ్రీవర్ధన్ బైక్‌పై హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు వెళుతున్నారు. మండలంలోని హన్మాజిపల్లికి చెందిన కల్లెపెల్లి సాయికృష్ణ గుండ్లపల్లి నుంచి కరీంనగర్‌కు వెళుతున్నాడు. ఈ రెండు బైక్‌లు గుండ్లపల్లి స్టేజి వద్ద మూలమలుపుపై వేగంగా ఢీకొన్నాయి. దీంతో ముగ్గురికీ తీవ్రగాయాలు కాగా జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తరలించారు.

కుక్కల దాడిలో వృద్ధురాలికి గాయాలు



వృద్ధురాలి చేతిపైన గాయాలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కుక్కలదాడిలో వృద్ధురాలికి తీవ్రగాయాలైన ఘటన వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండా గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులవివరాల ప్రకారం.. తండాకు చెందిన చింగ్లి బాయ్(85) వృద్ధురాలు ఇంటి బయటమంచంలో నిద్రిస్తుండగా కుక్కలుఒకసారిగా దాడి చేశాయి. దాడిలో రెండు చేతులకు, కడుపుపైన తీవ్ర గాయాలు కావడంతో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.

బస్సు ఢీకొని ఎక్సైజ్ సూపరింటెండెంట్ భార్య మృతి

శంకర్‌పల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ మహిళ మృతిచెందగా, మరోవ్యక్తికి తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మోకిల సీఐ వీరబాబు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని ఎక్సైజ్ డిపార్టుమెంట్‌లో సూపరిండెంట్‌గా విధులు నిర్వహించే రవిందర్ తనకుటుంబంతో కలిసి మోకిలలోని ఎన్‌సీడీ ఎవెన్యూలో కొన్నాళ్లుగా నివాసముంటున్నాడు. హోండాయాక్టివాపై భార్యాభర్తలు రవిందర్, ఉమాదేవి బుధవారం సాయంత్రం పని నిమిత్తం నార్సింగికి వెళ్లారు. పని ముగించుకుని రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా, మోకిలలోని సుబిషి విండ్‌సర్ హోమ్స్ వద్ద అతివేగంగా వెను కనుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొది. దీంతో హోండా యాక్టివాపై ఉన్న రవిందర్, ఉమాదేవి కిందపడిగా వారికి తీవ్రగాయాల య్యాయి. వారినివెంటనే చికిత్సనిమిత్తం కుటుంబీకులు, స్థానికులు శంకర్‌పల్లిలోని ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఉమాదేవిని సంగారెడ్డిలోని ఆసుపత్రికి తరలించారు. కాగా ఆమె అప్పటికే చనిపోయిందని డాక్టర్లు తెలిపారు. గాయపడిన రవిందర్ గచ్చిబౌలిలోని సన్‌షన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగాఎక్సైజ్ సూపరింటెండెంట్ రవిందర్ ఈనెల31న రిటైర్డు అవ్వనున్నారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

చొప్పదండి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): చొప్పదండికి చెందిన తాళ్లపల్లి అమృతవ్వ(70) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ అనూష కథనం ప్రకారం.. తనకుమారుల భూమి గొడవల కారణంగా మనస్థాపంతో జీవితంపై విరక్తిచెందిన అమృతవ్వ ఇంట్లోఉన్న సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆమె తెలిపారు.

మైనర్లు నడుపుతున్న వాహనాలు సీజ్

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు గురు వారం ఇందిరాచౌక్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి వాహనాలు నడుపుతున్న 15మంది మైనర్‌లనుపట్టుకుని, వాహనాలను సీజ్‌చేశారు. అలాగే శబ్ధ కాలుష్యానికి కారణమవుతున్న రెండు ద్విచక్రవాహనాలను పట్టుకుని ఠాణాకు తరలించారు. పట్టుబడిన మైనర్‌ల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి మైనర్‌లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహన యజమానులపై కేసులు నమోదుచేసి కోర్టులో హాజరుపరుస్తామని విద్యార్థులకు పరీక్షల జరుగుతున్నందున పెద్దపెద్ద శబ్దాలు చేసే వాహనాల యజమానులపై కఠినంగా వ్యవహరిస్తామని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ అన్నారు. ఈతనిఖీలలో ట్రాఫిక్‌సీఐ పర్శరమేష్, ఎస్ఐ ఉపేంద్రచారి, ఆర్ఎస్ఐ గణేష్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

వీర్నపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారుచేసినా, అమ్మినా కఠిన చర్యలు తప్పవని ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. వీర్నపల్లి మండలం భూక్యతండా గ్రామంలో ఇండ్లలో నిల్వ చేసిన గుడుంబా స్థావరాలపై ఎస్ఐ ఎల్లాగౌడ్‌తో కలిసి పోలీసులు గురువారం దాడులు చేశారు. దాడుల్లో 950 లీటర్ల బెల్లం పానకాన్ని పోలీసులు ధ్వంసంచేశారు. సారా తయారీకి ఉపయోగించే 25 కిలోల బెల్లం, 20 లీటర్ల గుడుంబా, పట్టుకొని సీజ్ చేశారు. సారా తయారీకి ఉపయోగించే డ్రమ్ములు, బిందెలను పగలగొట్టారు. సారా తయారుచేస్తున్న వ్యక్తిపై వివిధ సెక్షన్లలో ఆరుకేసులు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. తండాలలో గుడుంబా తయారు చేస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. దాడుల్లో ఎస్ఐ ఎల్లాగౌడ్, హెడ్ కానిస్టేబుళ్ల బాబు, లక్ష్మణ్, సిబ్బంది మల్లాగౌడ్, కార్తీక్, యాకుబ్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేసిన వ్యక్తికి జరిమానా

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ద్వారా దూషిస్తూ, అసత్య ప్రచారం చేసిన కేసులో ఒకరికి రూ.5వేల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు సెకండ్ అడిషనల్ న్యాయమూర్తి వినీల్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం గొల్లపెల్లి పోలీస్‌స్టేషన్‌పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి ఎరవేణి రమేష్‌పై అదేగ్రామానికి చెందిన మహ్మద్‌నజీర్ అనేవ్యక్తి సామాజిక మాధ్యమాలద్వారా తప్పుడు ప్రచారంచేశాడు. తీవ్ర మానసికక్షోభకు గురైన రమేష్ 2020లో జరిగిన విషయాన్ని గొల్లపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై జీవన్ కేసు నమోదుచేశారు. కోర్టు డ్యూటీఅధికారులు సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించారు. నేరంరుజువు కావడంతో ముద్దాయి నజీర్‌కు జరిమానావిధిస్తూ న్యాయమూర్తితీర్పు వెలువరించారు.

రిటైర్డ్ తహసీల్దార్‌పై కేసు నమోదు

చందుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామంలో వ్యవసాయభూమిని అక్రమంగా పట్టాచేసిన రిటైర్డ్ తహసీల్దార్ బాలయ్యపై కేసు నమోదుచేసి, నోటీసు జారీ చేసినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. సీఐకథనం ప్రకారం మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన నేరెళ్ల ఎల్లయ్యకు చెందిన 898 సర్వేనంబర్‌లోని 18గుంటల వ్యవసాయ భూమినిఇదే గ్రామానికి చెందిన పత్తిపాక దేవరాజుకు 2005లోఅక్రమంగా పట్టాచేశారని ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి నోటీసులు ఇచ్చినటుసీఐ పేర్కొన్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట యువకుడి హల్‌చల్

- మద్యం మత్తులో బీరు సీసాతో తలపై గాయపరుచుకున్న వైనం
- తన భార్యను కాపురానికి వచ్చేలా చూడాలని వేడుకోలు



పోలీస్‌స్టేషన్ ఎదుట గాయపడిన యువకుడు శివరాం

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట శివరాం అనే యువకుడు మద్యం మత్తులో హల్‌చల్ చేశాడు. తన భార్యను కాపురానికి పంపాలని పోలీసులను వేడుకుంటూనే బీరు సీసాతో తలపై గాయపరుచుకుని అరగంటకు పైగా ఆందోళనకు దిగాడు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బేడబుడుగ జంగాల కాలనీకి చెందిన మంజుల అనే మహిళతో కరీంనగర్ జిల్లా రామడుగుకు చెందిన శివరాంకు మూడేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబ కలహాలు, ఓ కేసులో జైలు శిక్ష అనుభవించిన శివరాంతో కాపురం చేయడం ఇష్టం లేక మంజుల జగిత్యాలలోని తన పుట్టిన ఇంట్లోనే కొద్ది కాలంగా ఉంటోంది. గురువారం తన భార్యను కాపురానికి పంపాలని పెద్ద మనుషులను శివరాం వేడుకున్నప్పటికీ వెళ్లేందుకు మంజుల ఒప్పుకోలేదు. తీవ్ర మనస్థాపానికి గురైన శివరాం జగిత్యాల పట్టణపోలీస్ స్టేషన్‌కు మద్యం మత్తులో వచ్చి బీరు సీసాతో తలపై కొట్టుకున్నాడు. ఎస్సైలు కిరణ్ కుమార్, మన్మదరావు, గీతలతో పాటు పోలీసు సిబ్బంది శివరాంకు నచ్చజెప్పడంతో తన ఆందోళలనను విరమించాడు. పోలీస్ స్టేషన్ ఎదుట బీరుసీసా ముక్కను చేతిలో పట్టుకొని భయభ్రాంతులకు గురి చేసిన శివరాంపై పోలీసులు న్యూసెన్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ పేర్కొన్నారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్

- నగదు, నగలు, ఇతర సామాను దగ్ధం
- సుమారు రూ.25లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన నగదు

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగాపూర్ గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం షార్ట్ సర్క్యూట్ ఏర్పడి సుమారు రూ.25లక్షల వరకు ఆస్తినష్టం జరిగింది. బాధితుడు ముద్రకోలా గోపి తెలిపిన వివరాలు ప్రకారం.. శంకరపట్నం మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన ముద్రకోలా గోపి కొన్నేళ్లుగా గ్రామంలో గాజులు, ఫ్రిడ్జ్, కుర్చీలు, కూలర్లు, మిక్సీలు, తదితర వస్తువులు అమ్ముతున్నాడు. రోజువారిలాగానే గురువారం ఉదయం భార్య స్వప్నతో పాటు గోపి ఇతరగ్రామాలకు వ్యాపారం చేసుకోవడానికి ఇంటికి తాళం వేసి వెళ్లిపోయారు. షార్ట్‌సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు అంటుకోవడంతో గమనించిన చుట్టుపక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబసభ్యులు అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి ఇంట్లో ఉన్న రూ.1.20లక్షల చిట్టీ డబ్బులు, కంగన్‌హాల్ వస్తువులు, 5తులాల బంగారం, 20తులాల వెండీ అగ్నికి ఆహుతి అయ్యాయి. ఈప్రమాదంలో సుమారు రూ.25 లక్షల వరకు ఆస్తినష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. కాగా కేశవపట్నం పోలీసుల తోపాటు ఆర్ఐ బాలకిషన్ లింగాపూర్ చేరుకొని వివరాలు సేకరించారు.

'వైఫై' విషయంలో ఇద్దరి మధ్య గొడవ

- కుటుంబ సభ్యులపై దాడి
- చికిత్స పొందుతూ ఒకరి మృతి
- హత్య కేసు నమోదు



బహదూర్ భగత్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌నెట్ వైఫై విషయంలో జరిగిన చిన్న గొడవ ఒకరి హత్యకు దారితీసింది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న ఇద్దరు వర్కర్ల మధ్య బుధవారం మధ్యాహ్నం 'వైఫై' విషయంలో గొడవ జరిగింది. ఈ గొడవలో కరీంనగర్ కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న భగత్(40) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కరీంనగర్ మూడోఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల చౌరస్తా ఫేమస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న బహదూర్ రాజుకు, అదే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తున్న జగదీష్‌మధ్య బుధవారం మధ్యాహ్నం చిన్నగొడవ జరిగింది. ఒక కస్టమర్‌కు వైఫై పాస్‌వర్డ్ చెప్పే విషయంలో ఇద్దరు గొడవపడి కొట్టుకున్నారు. అనంతరం జగదీష్ ఇంటికి వెళ్లిపోయి అర్ధరాత్రి మళ్లీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు రాగా అతనికి బహదూర్‌రాజు సారీ చెప్పాడు. అయితే తనను అకారంగా బహదూర్‌రాజు కొట్టాడనే విషయాన్ని గురువారం ఉదయం జగదీష్‌తన బంధువులకు చెప్పుకున్నాడు. దీంతో జగదీష్‌తోపాటు మరికొందరు కలిసి ఉదయం 10గంటలసమయంలో కిసాన్‌నగర్‌లో నివాసం ఉంటున్న బహదూర్‌రాజు ఇంటికి వెళ్లి బహదూర్ రాజు, అతనిసోదరుడు ఆకాశ్, తండ్రిభగత్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో జగదీష్, అతనిసోదరులు బహదూర్ శంకర్, భారత్, దీపక్, కృష్ణ కలిసి ముగ్గురి కళ్లల్లో కారం పొడి చల్లి, కర్రలతో దాడిచేశారు. దీంతో బహదూర్ రాజు, ఆకాశ్ అక్కడినుంచి తప్పించుకుని పారిపోగా తండ్రి భగత్‌కుతీవ్రంగా రక్తగాయాలయ్యాయి. భగత్‌ను మొదట ప్రభుత్వ ఆసుపత్రికి, ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా సాయంత్రంభగత్ మృతిచెందాడు. మృతుడికొడుకు బహదూర్‌రాజు ఇచ్చిన ఫిర్యాదుతో జగదీష్, అతనిసోదరులపై హత్యకేసు నమోదుచేశామని, విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు.

కిరాణా షాపులో చోరీ

శంకరపట్నం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని కిరాణాషాపులో గురువారం చోరీ జరిగింది. బాధితురాలు బూర్ల లక్ష్మి తెలిపిన వివరాలప్రకారం.. కిరాణాషాపులో మహిళా సంఘాలకు సంబంధించిన12వేల నగదు ఉంచి బుధవారం సాయంత్రం షాపు తాళం వేశారు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి షాపు తలుపులకున్న గొల్లాన్ని ఊడదీసి లోపలివస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. క్యాష్‌కౌంటర్‌లో ఉంచిన నగదు మాయమైంది. ఈఘటనపై కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

పెద్దపల్లి/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి, సుల్తానాబాద్ మండలాల్లో అక్రమంగా తరలించేందుకు నిల్వ చేసిన 65 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నామని జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి రాజేందర్ తెలిపారు. గురువారంజిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులకు అందిన పక్కాసమాచారంతో పెద్దపల్లిలోని బందారికుంట, సుల్తానాబాద్ మండలంలోని దేవుని పల్లి గ్రామాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కలిసి తనిఖీచేశారు. డీఎస్‌ఓ రాజేందర్ మాట్లాడుతూ సుల్తానాబాద్ మండలం దేవునిపల్లిలో నిల్వ ఉన్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని, పెద్దపల్లిలోని బందారి కుంట వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నామని తెలిపారు. మొత్తం 65 క్వింటాళ్ల రేషన్ బియ్యంతో పాటు ఆటోను సీజ్ చేశామన్నారు. సీజ్‌చేసిన రేషన్‌బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు తరలించామని, ఆటోను పోలీస్‌స్టేషన్లో అప్పగించామని డీఎస్‌ఓ తెలిపారు.వాహనంయజమాని, డ్రైవర్, అక్కడపని చేస్తున్న ఇతరలేబర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. తనిఖీలలో పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు రవీందర్, మహేష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తమ సోదరుడి వ్యవసాయ పొలంలోకి కలుషితనీరువస్తున్నాయని పేర్కొంటూ రైస్‌మిల్లులోకి అక్రమంగా ప్రవేశించడంతో పాటు అసభ్య పదజాలంతో దూషించిన సంఘటనలో మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన ల్యాగలశ్రీనివాస్‌రెడ్డిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. గొల్లపల్లి గ్రామంలోని పొన్నాలదేవరెడ్డి గ్రామశివారులో శ్రీరాజరాజేశ్వర రైస్ మిల్లును నడిపిస్తున్నాడు. ఈనెల 12న సాయంత్రం తన వ్యాపార భాగస్వామి అయిన రాజిరెడ్డితో కలిసి రైస్‌మిల్లులోని కార్యాలయంలో ఉండగా శ్రీనివాస్‌రెడ్డి లోనికి వచ్చి కలుషిత నీరు పొలాల్లోకి వస్తున్నాయని గొడవకుదిగాడని చెప్పారు. అసభ్యపదజాలంతో దూషిస్తూ ఇనుప రాడుతో కార్యాలయ తలుపును ధ్వంసం చేశాడని పేర్కొన్నారు. బాధితుడు దేవరెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

ఆదర్శ పాఠశాలలో కంప్యూటర్ల చోరీ

వీణవంక, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్ల గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 3కంప్యూటర్లు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఎస్ఐ తోట తిరుపతి కథనం ప్రకారం.. పాఠశాలలో 11కంపూటర్లు ఉండగా ఈనెల 8,9వ తేదీలు సెలవులు రాగా 11న పాఠశాల కంప్యూటర్ ఇన్‌చార్జీ వెళ్లి చూడగా మూడు కంప్యూటర్లు కనిపించలేదు. మూడింటి విలువ దాదాపు రూ.20,000 ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రమాదకరంగా గన్నేరువరం చెరువు కల్వర్టు

- రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు
- పొంచి ఉన్న ప్రమాదం



చెరువు వద్ద కల్వర్టు పైన రెండు వైపులా కుంగిన సీసీ రోడ్డు

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు వద్ద ఉన్న లోలెవల్ కల్వర్టుపై సీసీరోడ్డు రెండు వైపులా కుంగి ప్రమాదకరంగా మారింది. బస్సులు, భారీ వాహనాలు కల్వర్టుపై వెళితే వాహనాలు అదుపు తప్పి ప్రమాదం జరిగే అవకాశంఉంది. కుంగిన కల్వర్టుకు ఒకపక్కచెరువు మత్తడితో కూడినలోతైన ప్రదేశం, మరోపక్క చెరువు ఉండడంతో రెండువైపులా ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. నిత్యం ఈ దారిగుండా గన్నేరువరం నుంచి పొత్తూరు మీదుగా కరీంనగర్‌కు బస్సులు వెళుతుంటాయి. అంతేకాకుండా ప్రైవేట్‌వాహనాలు, ద్విచక్రవాహన దారులు భారీసంఖ్యలో వెళ్తుంటాయి. రాత్రిసమయంలోనూ ఈదారిగుండా ప్రయాణిస్తుంటారు. చెరువుకట్ట నుంచి కిందకు దిగే ప్రదేశంలోనే కల్వర్టుపై సీసీరోడ్డు కుంగిపోయి ఉండడంతో ఆదమరిచి రోడ్డుకు పక్కకు వెళితే ప్రమాదాల బారిన పడాల్సిన పరిస్థితి ఉంది. ఎదురుగా వాహనంవస్తే ఆగాల్సిందే. వాహనదారులు ఈదారిగుండా వెళ్లడానికి జంకుతున్నారు. కల్వర్టుపై హైలెవల్ బ్రిడ్జినిర్మిస్తే ప్రయాణం సులువవుతుందని వాహనదారులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. మండలానికి డబుల్‌రోడ్డుతోపాటు హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించేందుకు నిధులు మంజూరైనప్పటికీ కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రమాదాలు జరగకముందు అధికారులు స్పందించివెంటనే డబుల్ రోడ్డుపనుల్లో భాగంగా కుంగిన లోలెవల్ కల్వర్టును తొలగించి వెంటనే హైలెవల్‌బ్రిడ్జీని నిర్మించాలని వాహనదారులు కోరుతున్నారు.

మానసిక దివ్యాంగుల పాఠశాలకు

ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్

- పాఠశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ఐఎస్‌వో సర్టిఫికెట్‌ను చూపెడుతున్న చాడ వెంకటరెడ్డి

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహాత్మానగర్ గ్రామంలోగల స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసికదివ్యాంగుల పాఠశాలకు ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ గుర్తింపు లభించిందని పాఠశాల చైర్మన్, మాజీఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. క్వాలిటీ మెనేజ్‌మెంట్ సిస్టం అనే సర్టిఫికేట్ నిర్వాహకులు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సర్టిఫికేట్‌కు మూడు సంవత్సరాల వరకు గుర్తింపు ఉంటుందని తెలిపారు. క్యూఆర్ఏ డిల్లీ సంస్థ వారు దివ్యాంగుల పాఠశాలను సందర్శించి, అన్నిరకాల పరిశోధనలుచేసి ఐఎస్‌వో సర్టిఫికేట్ విడుదల చేసినందుకు పాఠశాల తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సర్టిఫికేట్ ద్వారా దేశ,విదేశాలలో ఈ పాఠశాలకు గుర్తింపు వస్తుందని చాడవెంకట్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టుసభ్యులు కోమిరెల్లా రెడ్డి, ఎల్ మధుసుధన్‌రావు, గాజుల భగవాన్ నేత, జాప వెంకటరమణారెడ్డి, నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ సతీష్, ఈవో బాలరాజు, వార్డెన్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

సెమినార్లు విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతాయి

● ఎస్‌యూ వీసీ యు ఉమేష్‌కుమార్



మాట్లాడుతూన్నా ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): సెమినార్లు విద్యార్థులకు ఎంతో దోహదపడుతాయని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఆచార్య ఉమేష్‌కుమార్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలో రెండు రోజుల సెమినార్ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్-ఎ కీ క్యాటలిస్ట్ ఇన్ సస్టైనబుల్ బిజినెస్ డెవలప్మెంట్ ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఇలాంటి రెండురోజుల సెమినార్ నిర్వహించిన డాక్టర్ డి హరికాంత్, అధ్యాపక బృందాన్ని అభినందించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ డి హరికాంత్ మాట్లాడుతూ ఈ రెండురోజుల సెమినార్‌లో మొత్తం114 పరిశోధకపత్రాలు పంపించాని అందులో 74పేపర్ ప్రెజెంటర్స్ తమ రీసెర్చ్ పేపర్స్‌ని వివరిస్తూ వివిధ అంశాలపైన తమ పరిశోధనలు వివరిస్తూ సమాజానికి ఉపయోగపడే అంశాల గురించి చర్చించారని తెలిపారు. విశిష్ట అతిథి కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రస్తుత సమయంలో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ అనేది చాలా ముఖ్యపాత్ర పోషిస్తుందని అన్నారు. కార్యక్రమంలో విశిష్టఅతిథులుగా కే ప్రతాప్ రెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయ ఉపకులపతి, ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ ఐసిఎస్ఎస్ఆర్- ఎస్ఆర్‌సి హైదరాబాద్, విశిష్ట అతిథులుగా ప్రొఫెసర్ జాస్తి రవికుమార్, రిజిస్ట్రార్ శాతవాహన యూనివర్సిటీ, ప్రొఫెసర్ చెన్నప్ప రిజిస్ట్రార్, పాలమూరు విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ ఆకుల రవి, డీన్ కామర్స్ డిపార్ట్మెంట్ శాతవాహన విశ్వవిద్యాలయం, వాణిజ్య శాస్త్ర ఆచార్యులు మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం అతిథులుగా హాజరయ్యారు.

బ్యాంకింగ్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గణేశ్‌నగర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని డిగ్రీ ఉత్తీర్ణులైన వెనుకబడిన తరగతుల అభ్యర్థులకు హైదరాబాద్ స్కూల్ ఆఫ్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ద్వారా బ్యాంకింగ్, ఫైనాన్స్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన నిరుద్యోగ అభ్యర్థులు మార్చి 15వ తేదీనుంచి ఏప్రిల్8వరకు వెబ్‌సైట్ www.tgbcstudycircle.cgg.gov.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఈశిక్షణకు బిసి-ఎ, బి,డికి చెందిన, డిగ్రీపూర్తిచేసి 26సంవత్సరాల వయస్సులోపు ఉన్న అభ్యర్థులు అర్హులు అని తెలిపారు. అభ్యర్థుల తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతంలో 1.50లక్షలు, పట్టణ ప్రాంతంలో 2లక్షల లోపు ఉండాలని. ఆన్‌లైన్ స్క్రీనింగ్ టెస్ట్ 12-4-2025తేదీన కరీంనగర్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు.వచ్చిన మార్కుల ఆధారంగా 30మందిని అభ్యర్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం ప్రైవేట్ బ్యాంకుల్లో ఉపాధి కల్పించనున్నట్లు తెలిపారు.

ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థలో శిక్షణకు..

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణాసంస్థలో హౌస్ వైరింగ్, ఫొటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత శిక్షణ ఏప్రిల్ 1నుంచి ప్రారంభం కానున్నట్లు దీనికి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకుచెందిన గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆసక్తిగల పురుషులు దరఖాస్తు చేసుకో వాలని తెలిపారు. 30రోజుల పాటు ఈ ఉచితశిక్షణ ఉంటుందని ఎంపికైనా అభ్యర్థులకు ఉచితవసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తిగల అభ్యర్థులు 9849411002, 7981151653 నంబర్లను సంప్రదించాలని కోరారు.



జ్యూట్ బ్యాగు కట్టింగ్‌పై శిక్షణ తీసుకుంటున్న మహిళలు



శిక్షణలో మహిళలు తయారు చేసినవివిధ రకాల జ్యూట్ బ్యాగులు



జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ

- తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రంలో నెల రోజుల కోర్సు
- శిక్షణ పొందుతున్న మహిళలకు భోజన సౌకర్యం

తిమ్మాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఎక్కడ చూసినా ప్లాస్టిక్..ప్లాస్టిక్.. పర్యావరణాన్ని దెబ్బతిసే ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించినా ఏదో ఓ రూపంలో ముందుకువస్తోంది. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జ్యూట్ బ్యాగులు వాడాలని అధికారులు సూచిస్తున్నారు. ఇందులో భాగంగా తిమ్మాపూర్ దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం (మహిళా ప్రాంగణం)లో మహిళలకు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు.

● కలెక్టర్ చొరవతో..

కొన్నేళ్లుగా మండలంలోని దుర్గాబాయి మహిళా, శిశు వికాస కేంద్రం(మహిళా కేంద్రం)లో మహిళాలకు ఇచ్చే ఉచిత శిక్షణలు కనమరుగయ్యాయి. ఇటీవల ప్రాంగణాన్ని సందర్శించిన ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి పరిస్థితిని గమనించారు. వారి చొరవతో ఉచిత శిక్షణను తిరిగి ప్రారంభించారు. ఫిబ్రవరి 14 నుంచి జ్యూట్ బ్యాగుల తయారీపై ఉచిత శిక్షణను ప్రారంభించారు. నెల రోజుల ఉచిత శిక్షణతోపాటు శిక్షణ పొందుతున్న వారికి మధ్యాహ్నం ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 25 మంది మహిళలు ప్రస్తుతం శిక్షణ పొందుతున్నారు. శిక్షణ అనంతరం వారు జ్యూట్ బ్యాగుల తయారు చేసి విక్రయించే విధంగా చిన్న పరిశ్రమ పెట్టుకునేందుకు ప్రభుత్వం నుంచి అర్హులైనా వారికి సహకారం కూడా అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ బాగుంది..



- కె కోమల, కట్టరాంపూర్, కరీంనగర్

నేను మహిళా ప్రాంగణంలో జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ తీసుకుంటున్నా. శిక్షణ బాగుంది. ప్రతి రోజు ఓ రకమైన బ్యాగులను తయారు చేయడం నేర్పిస్తున్నారు. మహిళా గ్రూప్‌లో ఉన్న నాలుగురు సభ్యులం కలిసి ఈ శిక్షణ తీసుకుంటున్నం. శిక్షణ అనంతరం నాలుగురం కలిసి సొంతంగా జ్యూట్ బ్యాగుల తయారు పరిశ్రమ పెట్టుకుంటాం.

గ్రామాల్లో జ్యూట్ బ్యాగులను వాడేవిధంగా కృషి చేస్తాం



- రేవతి, పోరండ్ల

గ్రామాల్లో జ్యూట్ బ్యాగులపై అవగాహన ఉండదు. వీటిని తయారు చేసి ప్రజలకు అవగాహన కల్పించి విక్రయిస్తాం. పర్యావరణ పరిరక్షణతోపాటు ఉపాధి లభిస్తుంది. రైతులు, విద్యార్థులు, ఇంట్లో వస్తువులు కొనుగోలు చేసి తీసుకువెళ్లేందుకు ఈ జ్యూట్ బ్యాగులు ఉపయోగపడుతాయి. పర్యావరణ పరిక్షణకు జ్యూట్ బ్యాగులు వాడల్సిన అవసరం ఉంది.

25 మంది శిక్షణ పొందుతున్నారు..



- సవిత, ట్రైనర్

ప్రస్తుతం 25 మంది మహిళలు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందుతున్నారు. వారికి ప్రతి రోజు ఒక రకం బ్యాగు తయారు చేయడం నేర్పిస్తున్నాం. తక్కువ మార్జిన్‌తో బిజినెస్ ఎలా ప్రారంభించాలి, మార్కెటింగ్ ఎలా చేయాలి అనే దానిపై శిక్షణ అందిస్తున్నాం. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జ్యూట్ బ్యాగుల అర్డర్లు కూడా ఇప్పిస్తాం.

మహిళలకు ఉపయోగకరం



- వి సుధారాణి, జిల్లా మేనేజర్, దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం

ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ పమేలా సత్పతి చొరవతో ప్రాంగణం తిరిగి ప్రారంభమైంది. జ్యూట్ బ్యాగుల తయారీ శిక్షణకు కలెక్టర్ ఆర్థిక సహకారం అందిస్తున్నారు. మహిళలకు శిక్షణతో పాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళాలకు సర్టిఫికేట్‌తో పాటు సొంతంగా వ్యాపారం నిర్వహించుకునేందుకు ఆర్థిక వనరులు, రుణం అందిస్తాం. ఈ శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

యోగా చాంపియన్‌కు సన్మానం

● అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి
● కలెక్టర్ పమేలా సత్పతి



ఆమని పటేల్‌ను సన్మానిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్/సుల్తానాబాద్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేషనల్ యోగా చాంపియన్‌షిప్‌లో ఐదవస్థానం కైవసం చేసుకున్న ఆమనిపటేల్ జాపతిని జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి ఘనంగా సన్మానించారు. జాపతి ఆమని గతనెలలో కేరళలోని త్రివేండ్రంలో జరిగిన జాతీయ సీనియర్స్ యోగాసన చాంపియన్‌షిప్‌లో రాణించి ఐదవస్థానం సాధించింది. ఈసందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో తెలంగాణ యోగా అసోసియేషన్, కరీంనగర్ జిల్లా యోగా అసోసియేషన్ బాధ్యుల సమక్షంలో ఆమనిని ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికవ్వాలని కలెక్టర్ ఆకాంక్షించారు. కరీంనగర్ జిల్లా యోగా క్రీడాకారులు కొన్ని నెలలుగా అద్భుతమైన ప్రదర్శనతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై రాణించడం సంతోషదాయకమన్నారు. ప్రతిభావంతులకు ప్రభుత్వం పక్షాన ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడశాఖ అధికారి వి శ్రీనివాస్, తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్ధారెడ్డి, జిల్లా యోగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, యోగా కోచ్‌లు వి కిష్టయ్య, గుంటి రామకృష్ణ, పి మల్లేశ్వరి, జె రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తజన సందడి



వేంకటేశ్వర స్వామి వారి ఊరేగింపు

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తజన సందడి నెలకొంది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేంకటేశ్వర స్వామివారలను అశ్వవాహనంపై ఊరేగించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రాల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించారు. లక్ష్మీ నృసింహ స్వామి, అనుబంధఆలయాల్లో ఆలయ వేదపండితులు నిత్యపూజలు, అభిషేకాది కార్యక్రమాలను నిర్వహించారు. లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో భక్తులు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారలకు మహిళలు ఓడిబియ్యం సమర్పించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం పక్షాన 6వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ఆలయానికి రూ.8,03,092 ఆదాయం లభించింది. ఇందులో వివిధరకాల పూజల టిక్కెట్లు విక్రయించగా రూ.2,86,216 ప్రసాదాలు విక్రయించగా 4,61,000 లభించాయి. అలాగే అన్నదానం కోసం రూ.55,876 భక్తులు, దాతలు విరాళాలు సమర్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

ఆయాకార్యక్రమాల్లో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో ధర్మపురి సీఐ రాంనర్సింహరెడ్డి పర్యవేక్షణలో ఎస్ఐ ఉదయ్‌కుమార్ బందోబస్తు చర్యలు చేపట్టారు.

●బ్రహ్మోత్సవాల్లో నేడు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు బ్రహ్మ పుష్కరిణి లో శ్రీ పాత (యోగ) నారసింహ స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం ఉంటుంది. శ్రీ సద్గురు త్యాగరాజ ఆరాధనోత్సవాలు ప్రారంభం అవుతాయని ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ తెలిపారు.

కొండగట్టులో గిరిప్రదక్షిణ

- కొండ చుట్టూ 5.7కి.మీల మేర నడకమార్గం
- అభివృద్ధికి సొంత డబ్బులు అందించిన మంత్రి పొన్నం
- పూర్తయిన పనులు

మల్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో గిరిప్రదక్షిణకు వస్తున్న భక్తుల సంఖ్య ప్రతి నెలా పెరుగుతోంది. 2023 నుంచి ప్రతి పౌర్ణమి రోజు గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నారు. 2023లో చిలుకూరుకు ఆత్మారాం సురేశ్‌శర్మ ఆధ్వర్యంలో గిరిప్రదక్షిణ ప్రారంభించారు. శుక్రవారం పౌర్ణమి సందర్భంగా నిర్వహించే గిరిప్రదక్షిణ 26వది.కొండగట్టు చుట్టూ ప్రస్తుతం 5.7కి.మీ మేర గిరిప్రదిక్షణకు నడక మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇందుకు అయిన మూడు లక్షల రూపాయలను మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అందించారు. దిగువ కొండగట్టు స్టేజీ వద్ద ఉన్న హ నుమాన్ విగ్రహం నుంచి ఘాట్‌రోడ్డు, వై జంక్షన్ మీదుగా జేఎన్‌టీయూ మార్గంలోని బొజ్జపోతన ఆలయం వరకు మూడు కిలోమీటర్లు, అక్కడి నుంచి గుట్టను ఆనుకొని మంచి నీళ్ల బావి, సంతోళ్లలొద్ది నుంచి మెట్ల మార్గం వరకు మరో 2.7కి.మీలతో నడకమార్గం ఏర్పాటయింది. దీంతో గిరిప్రదక్షిణ సులువు కావడంతో వందలాదిగా భక్తులు పాల్గొంటున్నారు. ఈ మార్గం ఏర్పాటు కాకముందు దిగువ కొండగట్టు, దొంగలమర్రి, జేఎన్‌టీయూ, రాంసాగర్, మద్దుట్ల, నూకపల్లి, మల్యాల క్రాస్‌రోడ్డు, కొండగట్టు వరకు సుమారు 24 కిలోమీటర్ల గిరిప్రదక్షిణ చేశారు. ప్రస్తుతం అది 5.7 కిలోమీటర్లకు తగ్గడంతో భక్తులకు సౌకర్యంగా మారింది.



కొండగట్టు గుట్ట చుట్టూ ఏర్పాటు చేసిన నడక మార్గం

సమాజహితం కోసమే

- ఆత్మారాం సురేశ్‌శర్మ మహరాజ్, గిరిప్రదక్షిణ ప్రారంభకులు



భక్తులందరినీ ఒక చోట చేరుస్తూ వారికి భగవంతుడి శక్తిని ప్రసాదించడం కోసం ఈ గిరి ప్రదక్షిణ చేపట్టాం. వందలాదిగా భక్తులు గిరి ప్రదక్షిణలో పాల్గొంటున్నారు. భక్తులు ప్రతి నెలా గిరిప్రదక్షిణలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. సమాజ హితం కోసమే ఈ కార్యక్రమాన్ని చేపట్టాం.

● అభివృద్ధితో భక్తులకు సౌకర్యం

ప్రస్తుతం చదును పనులు పూర్తి చేసుకున్న గిరిప్రదక్షిణ నడకమార్గాన్ని ప్రభుత్వం అభివృద్ధి చేయాల్సి ఉంది. మట్టి రహదారి కావడంతో భక్తులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఆయాసం వచ్చినప్పుడు, సేదతీరడానికి బెంచీలు, నీరు, విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయాల్సి ఉంది. గిరిప్రదక్షిణ మార్గాన్ని అభివృద్ధి చేస్తామని స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యం తెలిపారు.

మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



మృతిచెందిన పూసాల రోహిత్

చొప్పదండి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళనతో ఓ ఇంటర్ విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని రుక్మాపూర్‌లో గురువారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అనూష కథనం ప్రకారం.. రుక్మాపూర్‌కు చెందిన పూసాల రోహిత్(17) కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం రాత్రి వరకు చదువుకున్న రోహిత్ గురువారం వేకువజామున ఇంటిముందు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పరీక్షల్లో మార్కులు తక్కువ వస్తాయనే ఆందోళన చెంది ఉరివేసుకొని మరణించాడని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ మేరకు కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తా చాటిన అగ్రహారం విద్యార్థులు



పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

వేములవాడ టౌన్ మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మండలం అగ్రహారం ప్రభుత్వ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి జిజ్ఞాస పోటీల్లో సత్తాను చాటారు. ప్రభుత్వడిగ్రీ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు కాంపాక్ట్ డిస్క్ యాజ్ ఏ డిఫ్రాక్షన్ గ్రేటింగ్ అనే అంశంపై పరిశోధన నిర్వహించారు. ఈ పరిశోధనలో, కంపాక్ట్ డిస్క్‌ద్వారా కాంతి వివర్తనాన్ని ఎలా ప్రదర్శించవచ్చో, డిస్క్‌లోని వలయాల మధ్యదూరాన్ని లేజర్‌కాంతి సహాయంతో ఎలా నిర్ణయించవచ్చో విశ్లేషించారు. ఈ ప్రయోగం భౌతికశాస్త్రంలో కాంతి వివర్తన లక్షణాలను అర్థం చేసుకోవడానికి సహాయపడుతుందని, కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ నిర్వహించిన జిజ్ఞాస కార్యక్రమం రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఈ ప్రాజెక్టు ఎంపికైందని, భౌతికశాస్త్ర విభాగ విద్యార్థులు, ప్రాజెక్టు సూపర్‌వైజర్ డాక్టర్ ఎస్. కృష్ణప్రసాద్ నేతృత్వంలో రాష్ట్రస్థాయిలో ప్రదర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శంకర్, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ టి లావణ్య పరిశోధనలో పాల్గొన్న విద్యార్థులను ప్రాజెక్టు సూపర్‌వైజర్‌ను అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

గన్నేరువరం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. ఎస్సై తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. గన్నేరువరం శివారులో గురువారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా చొక్కారావుపల్లి నుంచి ఆటోలో సుమారు 4 క్వింటాళ్ళ పీడీఎస్ బియ్యాన్ని మండల కేంద్రానికి తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. గన్నేరువరానికి చెందిన గంటా కొమురయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ రవిచంద్ర



డాక్టర్ రవిచంద్ర

కరీంనగర్ కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): నేపాల్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా డాక్టర్ పొన్నం రవిచంద్ర ఎంపికయ్యారు. నేపాల్‌లో ఈనెల 19నుంచి 25వ తేదీవరకు జరగనున్న ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ అంతర్జాతీయ 8వ చలన చిత్రోత్సవానికి జ్యూరీ సభ్యుడిగా ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌత్‌రీజియన్ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్రను నియమించినట్లు ఫెస్టివెల్ ఛైర్‌పర్సన్ కెపిపాఠక్ తెలిపారు. జ్యూరీ సభ్యులు ఐఎఫ్ఎఫ్ఎస్ డాన్ క్విక్సోట్ ఫీచర్‌ఫిల్మ్ అవార్డు కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమచిత్రాలను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : కూతురితో అసభ్యకరంగా ప్రవర్తించిన తండ్రికి మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాలరూరల్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన వ్యక్తి తనకూతురితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితకుటుంబ సభ్యులు 2021లో జగిత్యాలరూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై చిరంజీవి పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కోర్టు డ్యూటీ అధికారులు ఎస్సైలు చిరంజీవి, శ్రీకాంత్, కానిస్టేబుళ్లు నరేష్ శ్రీధర్, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణారావు కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

రాజన్న ఆలయంలో ఘనంగా డోలోత్సవం

వేములవాడ కల్చరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం డోలోత్సవం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డోలోత్సవం కార్యక్రమంలో అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికిభక్తులుహాజరైమొక్కులు చెల్లించుకున్నారు.



డోలోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఇద్దరికి రిమాండ్

జగిత్యాలక్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశానికి పంపిస్తానని రూ.3.5 లక్షలు తీసుకుని మోసగించిన కేసులో ఇద్దరు వ్యక్తులను జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకుని గురువారం రిమాండ్‌కు తరలించారు. ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి గ్రామానికి చెందిన దేశెట్టి రాకేష్ అనే వ్యక్తిని ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి పంపి స్తామని చెప్పి జగిత్యాల పట్టణానికి చెందిన అల్లెపు వెంకటేష్, చల్ల మహేష్ అనే ఇద్దరు వ్యక్తులు మోసానికి పాల్ప డ్డారు. దీంతో పోలీసులు బుధవారం అల్లెపు వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. 24 గంటల వ్యవధిలోనే మరో నిందితుడైన చల్ల మహేష్ గురువారం పట్టుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వేణు గోపాల్ పేర్కొన్నారు.

విద్యాసంస్థల్లో ముందస్తు హోలీ వేడుకలు


జగిత్యాల అంగన్‌వాడీ కేంద్రంలో హోలీ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు


పైడిపల్లి పాఠశాలలో హోలీ వేడుకల్లో చిన్నారులు

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం పలు విద్యాసంస్థల్లో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించారు. జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్‌లో గల అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు రంగులు పూసుకుంటూ కేరింతలు కొడుతూ సంబరాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ స్వప్న, చిన్నారులు పాల్గొన్నారు.

●**రాయికల్:** మండలంలోని ప్రగతి ఉన్నత, విశ్వశాంతి పాఠశాలల్లో ముందస్తు హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు బాలె శేఖర్, మచ్చ గంగాధర్, పాఠశాలల డైరెక్టర్‌లు నిఖిల్ కుమార్, మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**వెల్గటూర్:** మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో హోలీ సంబరాలు నిర్వహించారు. పైడిపల్లి ప్రాథమిక పాఠశాల, జగదేవ్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలల్లో హోలి సంబరాలు జరుపుకున్నారు. హోళి సందర్భంగా హానికరమైన రంగులు పూసుకొని అనారోగ్యం పాలు కావద్దని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో హోలీ సంబరాలు నిర్వహిం చారు. శ్రీవాగ్దేవి విద్యాసంస్థలు, ఎస్‌జీఆర్, లాస్య, సాయిశ్రీ, కేరళ స్కూలల్లో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు రంగులు చల్లుకుంటూ వేడుకలు జరుపుకున్నారు. ముత్యంపేటలోని మూడవ అంగన్‌వాడీ కేంద్రంలో హోలీ సంబరాలు చేసుకున్నారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం మొగిలిపేట గ్రామంలోని శ్రీచైతన్య పబ్లిక్ పాఠశాల లో విద్యార్థులు రంగులను పూసుకుని వేడుకలను జరుపుకున్నారు. ఉపాధ్యాయులు కాముడు పున్నమి, హోలీ పండగ విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెగడపల్లి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన పెగడపల్లి మండలంలోని బతికెపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ జాకీర్ పాషా (47) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఈనెల 10న గ్రామంలో నడుచు కుంటూ వెళ్తున్న ముగ్గురు వ్యక్తు లను కారు అతి వేగంతో వచ్చి ఢీకొట్టగా తీవ్ర గాయాల పాలైన ఇద్దరిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. జాకీర్‌పాషా కరీంనగర్ లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తి రిమాండ్

పెగడపల్లి , మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతికి కారణమైన పంగ రాజయ్య అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెగడపల్లి ఎస్ఐ రవి కిరణ్ తెలిపారు. బతికెపల్లి గ్రామానికి చెందిన పంగ రాజయ్య అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి ధర్మపురి మండలం తిమ్మాపూర్‌లో నివసిస్తున్నాడు. ఈనెల 10న బతికెపల్లి గ్రామంలోని తన బంధువుల ఇంట్లో శుభ కార్యక్రమానికి హాజరు కావడానికి కుటుంబంతో సహా వచ్చారు. శుభకార్యం అనంతరం తిమ్మా పూర్ వెళ్లే క్రమంలో రాత్రి సమ యంలో కారును అజాగ్రత్తగా నడిపి ముగ్గురు వ్యక్తులను ఢీకొట్టగా తీవ్ర గాయాల పాలయ్యారు. వెంటనే చికిత్స నిమిత్తం తరలించగా సయ్యద్ సర్వర్‌పాషా, సయ్యద్ జాకీర్ పాషా అనే అన్నదమ్ములు మరణించారు. మరో మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. నిర్లక్ష్యంగా వాహనాన్ని నడిపి ఇద్దరు మృతికి కారణమైన రాజయ్యను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

ఇద్దరిపై కేసు

కొడిమ్యాల, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద గల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ వద్ద బైక్‌ను అతివేగంగా నడిపి సిబ్బందితో దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు వ్యక్తులపై బుధవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.సందీప్ తెలిపారు. జగిత్యాలకు చెందిన మేదరి శివకుమార్, వేముల నాగరాజు చెప్యాల క్రాస్ రోడ్డు వద్ద ఉన్న బంకు వద్దకు అతి వేగంగా బైకును నడుపుతూ వచ్చి కింద పడిపోయారు. కింద పడిన ఇద్దరు వ్యక్తులు సీసీ ఫుటేజీలు చూపాలని బంకు సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. గొడవను ఆపడానికి వెళ్లిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై తెలిపారు. బంకు సిబ్బంది చిర్ర నరేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మోడల్‌స్కూల్ వార్షికోత్సవం

రాయికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్, కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సంతోష్, గంగారెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆదిరెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'మూత్రపిండాల ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి'

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మూత్రపిండాల ఆరోగ్యంపై అందరికీ అవగాహన కల్పించాలని ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని స్థానిక ఎస్‌కేఎన్‌ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ప్రపంచ కిడ్నీ దినోత్సవం మరియు జాతీయ నో స్మోకింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం చేయాలని, రక్తపోటును నిరంతరం అదుపులో ఉంచుకోవాలన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం చక్కటి జీవనశైలితో కిడ్నీల ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చన్నారు. యువత ధూమపానంకు దూరంగా ఉండాలన్నారు. ధూమపానం వల్ల అనేక అనర్థాలు ఉన్నాయని విద్యార్థులకు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలిసిస్ కేంద్రంలో గురువారం ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఏరియా అసుపత్రి సూపరింటెండెంట్ సునిత ఆధ్వర్యంలో డయాలసిస్ రోగులచే కేక్ కట్ చేయించి వేడుకలను జరిపారు. ఈ సందర్భంగా మూత్రపిండాల వ్యాధి నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు వినోద్ కుమార్, శ్రీనివాస్, గంగధర్, ఆరోగ్య మిత్ర కర్నె శ్రీనివాస్, డయాలిసిస్ ఇంచార్జ రామకృష్ణ టెన్నీషియన్లు, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా కామదహన వేడుకలు


కామదహనంలో పాల్గొన్న పద్మశాలి సంఘం నాయకులు

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని టవర్, జంబిగద్దె, గణేష్ నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో కామ దహన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాత వస్తువులను ఒక చోట చేర్చి సాంప్రదాయ పద్ధతిలో కామ దహన వేడుకలు నిర్వహించగా మహిళలు కోలాటాలు వేసి సందడి చేశారు. చిన్నారులు జాజిరి ఆటకు ఉపయోగించిన కర్రలను మంటల్లో వేసి వేడుకల్లో పాలుపంచుకున్నారు.

●**మెట్‌పల్లి టౌన్:** పట్టణంలోని పద్మశాలి సంఘ ఆధ్వర్యంలో గురువారం కామదహన వేడుకలను నిర్వహించారు. పద్మశాలి సంఘ భవనంలో ప్రత్యేకంగా సేకరించిన పాత వస్తువులతో కాముడిని పేర్చి దహనం చేసి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ద్యావనపల్లి రాజారం, సభ్యులు సంకు ఆనంద్, అన్నం నాగరాజు, గుంటుక గౌతమ్, భీమనాథి సత్యనారాయణ, బెత్తు భాస్కర్‌లతో పాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు. అదే విధంగా పట్టణంలోని వివిధ కుల సంఘాలు యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రమైన కొడిమ్యాలలోని అంగడిబజారులో గురువారం రాత్రి యువకులు, గ్రామస్థులు కామ దహనం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ పూజారి భాస్కర్ పూజలు చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు కర్రలను పోగు చేసి నిప్పంటించారు. వారం రోజులుగా జాజిరి ఆడిన కుర్రాళ్ళు వారి కోలలను మంటలో వేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, యువకులు పాల్గొన్నారు.

క్రీడా విద్యార్థులకు అభినందన

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హై స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు. బాలికల విభాగంలో మైత్రి, బాలుర విభాగంలో శ్రీహర్ష గతేడాది అక్టోబర్‌లో పెద్దపల్లిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్-14 ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చి, ఈ నెల 14నుంచి 16 వరకు డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణం, వనపర్తిలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో సైతం ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సహచర డైరెక్టర్‌లు శ్రీధర్‌రావు, మౌనికరావు, రజితరావుతో పాటు ఉపాధ్యా య బృందం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ధర్మపురి శేషప్ప కళావేదికపై గురువారం రాత్రి వేళలో స్థానిక కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ బృందంచే భక్తి సంగీత విభావరి భక్తులను ఎంతో ఆకట్టుకుంది. కళాకారుడు గుండి జగదీశ్వర్‌శర్మ పాడిన భక్తి, సంగీతం, సినిమా పాటలు విని శ్రోతలు వీనుల విందు పొందారు. అలాగే రాత్రి వేళలో హైదరాబాద్‌కు చెందిన లోకె వైష్ణవి, వరంగల్‌కు చెందిన పి. పద్మజ భక్తి సంగీత విభావరి, హైదరాబాద్‌కు చెందిన దుర్గమైత్రేయి వీణ కచేరి భక్తులను ఆనందంలో ముంచెత్తాయి. జగిత్యాలకు చెందిన ఎ.నాగరాణి హరికథ గానం విని భక్తులు ఎంతో ఆనందం చేశారు.. కళాకారులకు ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ శాలువా కప్పి సన్మానించారు.

పెరుగుతున్న సిజేరియన్లు

(5వ పేజీ తరువాయి)

సాధారణ ప్రసవాలు తగ్గడం పలువురిని విస్మయానికి గురిచేస్తోంది.

● శస్త్ర చికిత్సలతో కలిగే దుష్పరిణామాలు

శస్త్ర చికిత్స ప్రసవాలతో ఎక్కువగా తల్లీ బిడ్డలు ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తోంది. రక్తస్రావం అధికమైనా, ఇతరత్రా సమస్యలు తలెత్తినా ప్రాణాపాయంతో పాటు భవిష్యత్తులో ఇబ్బందులను ఎదుర్కొనాల్సి రావచ్చును. గర్భాశయానికి గాట్లు పెట్టి కుట్లు వేసిన ప్రాంతంలో మాయ అతుక్కుపోయే అవకాశాలుంటాయి. దీంతో అప్పుడప్పుడు కడుపు నొప్పి సమస్యలు తలెత్తవచ్చు. కొన్ని సందర్భాల్లో గర్భ సంచి తొలగించే పరిస్థితి ఏర్పడవచ్చు. శస్త్ర చికిత్స సమయంలో గర్భ సంచి పక్కన ఉండే మూత్రాశయం దెబ్బతింటే రక్తం ఊపిరితిత్తుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది.

● కట్టడికి కార్యాచరణ

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ రూపొందించాయి. రాష్ట్రంలోనే అధిక సిజేరియన్లు చేస్తున్న జాబితాలో జగిత్యాల జిలా ఉందని, ఇందులో ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువగా జరుగుతున్నాయని గుర్తించారు. గర్భిణులకు శస్త్ర చికిత్స జరపడానికి విధిగా అనుమతి తీసుకోవాలన్న నిబంధనను ముందుకు తెస్తున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడంలో భాగంగా ఆయుష్మాన్ భారత్ ఎన్‌హెచ్‌పీఎం (కేంద్ర ప్రభుత్వ జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం) తీసుకొచ్చారు. మొత్తం ప్రసవాల్లో 30 శాతం మాత్రమే శస్త్ర చికిత్సలు జరగాలని సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సైతం ప్రైవేటులో జరుగుతున్న శస్త్ర చికిత్సలకు సంబంధించి ప్రతీ నెల నివేదికలను అందించాలని ఆదేశించింది. ప్రతి నర్సింగ్ హోం యాజమాన్యం విధిగా ఆ గర్భిణి ఆరోగ్య పరిస్థితి, సాధారణ ప్రసవానికి ఎదురయ్యే అడ్డంకుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తే శస్త్ర చికిత్సలు తగ్గే అవకాశాలున్నాయి.

వేధింపులు భరించలేక భర్తను నరికి చంపిన భార్య

మేడిపల్లి, మార్చి 13: మేడిపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో వేధింపులు భరించలేక గురువారం తెల్లవారుజామున భర్త రాజన్న(55)ను గొడ్డలితో నరికి ఆయన భార్య లక్ష్మి హత్య చేసింది. వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న రాజన్న కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసయ్యాడు. రాజన్న, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె . రాజన్న ప్రతి రోజు మద్యం తాగి వచ్చి భార్యను వేధించేవాడు. నెల రోజుల క్రితం రాజన్న మద్యం మత్తులో భార్య లక్ష్మిని తీవ్రంగా కొట్టి గాయపరిచాడు. బుధవారం రాత్రి మద్యం తాగి వచ్చి లక్ష్మిని దుర్భాషలాడాడు. దీంతో ఆగ్రహం చెందిన లక్ష్మి అతడు నిద్రిస్తుండగా తెల్లవారుజామున గొడ్డలితో నరికి హత్య చేసింది. రాజన్న చెల్లెలు సంఘ శారద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

రైతుల అభ్యున్నతికి సహకార సంఘాలు కృషి



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్

జగిత్యాల, మార్చి 13(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి కృషి చేయాలని జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో గురువారం జిల్లాస్థాయి సహకార సంఘాల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల శ్రేయస్సే ధ్యేయంగా పనిచేయాలన్నారు. సహకార సంఘాలు ఆదాయపు పన్ను రిటర్న్‌ను నిర్దిష్ట గడువులోపు సమర్పించాలన్నారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జితేంద్రప్రసాద్ మాట్లాడుతూ రానున్న ధాన్యం సేకరణలో సహకార సంఘాల కార్యదర్శులు కీలకభూమిక పోషించాలన్నారు. సమావేశంలో సహకార శాఖ ఆడిట్ అధికారి సత్యనారాయణ, డీసీఓ ఆఫీస్ సూపరిండెంట్ సుజాత, సహకార సిబ్బంది, జిల్లాలోని అన్ని సహకార సంఘాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

'ఎల్‌ఆర్ఎస్ రాయితీని సద్వినియోగం చేసుకోవాలి'

జగిత్యాలరూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఆర్‌ఎస్‌ను మార్చి నెలాఖరులోపు చెల్లించేవారికి ప్రభుత్వం 25శాతం రాయితీని కల్పించిందని జగిత్యాల జిల్లా పంచాయితీ అధికారి మదన్‌మోహన్ అన్నారు. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్ లోని గ్రామపంచాయితీ వద్ద ఎల్‌ఆర్ఎస్ నమోదు ప్రక్రియను డీపీఓ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా డీపీఓ మాట్లాడుతూ ఓపెన్‌ల్యాండ్స్ ఉన్నవారందరు ఎల్‌ఆర్ఎస్ ఫీజును చెల్లించి రెగ్యులరైజేషన్ చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం కల్పించిన రాయితీ విధానాన్ని ఓపెన్‌ల్యాండ్స్ కలిగిన యజమానులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ల్యాండ్ రెగ్యులరైజేషన్ చేసిన అనంతరం రుసుము చెల్లించినట్లు రశీదు ఇచ్చి ప్రొసీడింగ్‌ను అధికారులు అందజేస్తారని తెలిపారు. ఎవరైనా భూయజమానులు అందుబాటులో లేని యెడల గ్రామపంచాయితీ కార్యదర్శికి గూగుల్‌పే, ఫోన్‌పే ద్వారా లేదా ఇంటర్నెట్ ద్వారా డబ్బులు పంపించి రుసుము చెల్లించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీఓ కందుకూరి రవిబాబు, జీపీకార్యదర్శి పాల్గొన్నారు.

కుమారులు పోషించడం లేదని ఫిర్యాదు

జగిత్యాల అర్బన్, 13 మార్చి (ఆంధ్రజ్యోతి): కుమారులు తమను పోషించడం లేదని మల్యాల మండలం పోతారం గ్రామానికి చెందిన నిమ్మ నర్సయ్య, భూమక్క దంపతులు ఆర్డీవో మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. మాకు ఇద్దరు కొడుకులు రాజిరెడ్డి, వెంకటేష్‌లు ఉన్నారని వీరికి రెండెకరాల 12 గుంటల భూమి పంచి ఇచ్చామన్నారు. చెరో ఇల్లు కూడా ఇచ్చామని అయినప్పటికీ తమకు తిండి పెట్టే దిక్కు లేకుండా పోయిందని రోదిస్తూ తెలిపారు. వీరి వెంట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ కుమర్, కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం తదితరులు ఉన్నారు.

'రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు'

జగిత్యాలరూరల్, మార్చి 13: జగిత్యాల నియోజక వర్గానికి ఏడాది కాలవ్యవధిలో రోడ్లనిర్మాణం కోసం రూ. 100 కోట్లకు పైగా నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరుచేసిందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని బాలపల్లి- హన్మాజీపేట గ్రామాల మధ్య రూ. 31.50 లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం జగిత్యాల రూరల్ మండలం లోని తక్కళ్లపల్లి గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ లో కార్యక్రమంలో భాగంగా రూ. 20లక్షలతో నిర్మించనున్న పల్లె దవాఖానస్థలాన్ని పరిశీలించారు. పల్లె దవాఖానకు భూదానం చేస్తున్న హన్మాన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక పల్లె దవాఖానాలను జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు చేయించానని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముస్కుఎల్లారెడ్డి, దశరథరెడ్డి, బాలముకుందం, రవీందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, విక్రమ్, రమణరెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటేష్, మాజీసర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు ప్రజలు పాల్గొన్నారు.

జాతీయ సదస్సులో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, మార్చి13 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్సిటీలో కామర్స్ డిపార్ట్‌మెంట్ వారు రెండు రోజులుగా నిర్వహిస్తున్న డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మరియు ఏకీ క్యాపిటలిస్ట్ సస్టేనేబుల్ జాతీయ సదస్సులో జగిత్యాలకు చెందిన రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నట్లు రామకృష్ణ విద్యాసంస్థల చైర్మెన్ యాద రామకృష్ణ తెలిపారు. ఈ సదస్సులో కళాశాలకు చెందిన ఫస్ట్, సెకండ్ ఇయర్‌కు చెందిన సుహాన కౌసర్, సాజియ తబసుం తో పాటు అధ్యాపకులు రాకేష్,అఫ్సర్‌లు పాల్గొని తమ ప్రజంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. కరస్పాండెంట్ యాద రామకృష్ణ వెంట ప్రిన్సిపాల్ రాజేందర్ ఉన్నారు.

జాతర ఏర్పాట్లు పూర్తి

రాయికల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చింతలూరు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. రుక్మిణి సత్యభామ సమేతంగా నెలకొన్న శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సందర్భంగా ప్రతియేటా నిర్వహించే జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ సర్పంచ్ అనుపురం శ్రీనివాస్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ ఓరుగంటి రమణ రావు తెలిపారు. ఈ జాతరకు రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని చింతలూరు, బోర్నపెల్లి, ఒడ్డెలింగాపూర్, దావన్‌పెల్లి, వస్తాపూర్, తాట్లవాయి, ధర్మాజీపేట, కొత్తపేట, మూటపెల్లి, భూపతిపూర్, మల్లాపూర్ మండలం కడెం మండలాల నుంచి ప్రజలు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారని తెలిపారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా శ్రీనివాస్

ధర్మపురి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా ఇమ్మడి శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా నూతన ఏజీపీ నియామకం పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు రౌతు రాజేష్, ట్రెజరీ జాజాల రమేష్, ఉపాధ్యక్షులు రామడుగు రాజేష్, స్పోర్ట్స్ సెక్రటరీ బత్తిని ఇంద్రకరణ్, న్యాయవాదులు గడ్డం సత్యనారాయణరెడ్డి, అలువ వినోద్, గడ్డం లింగారెడ్డి, సుంకె రాజు, కలమడుగు కీర్తి తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

కొడిమ్యాల, మార్చి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడూర్ గ్రామంలో గల మానేరు ఉన్నత పాఠశాల 4వ వార్షికోత్సవం గురువారం గ్రామ శివారులోని ఎలికె గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి, కరీంనగర్ ఎస్‌ఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్లు సునీతారెడ్డి, కృష్ణారెడ్డిపాల్గొన్నారు.

గ్రూపు-2లో తుమ్మెనాల వాసికి 155వ ర్యాంక్


మోహన్

ధర్మపురి, మార్చి13 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని తుమ్మెనాల గ్రామానికి చెందిన రేణు మోహన్ ఇటీవల విడుదల చేసిన గ్రూపు-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో 155వ ర్యాంక్ సాధించాడు. రేణు మోహన్ ప్రస్తుతం నిజామాబాద్ బీసీ సంక్షేమ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఈసందర్భంగా రేణు మోహన్‌ను పలువురు అభినందించారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ వసంత, నాయకులు

జగిత్యాల క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సతీష్, ఆనందరావు, గంగాధర్, హరిచరణ్ రావు, మహిపాల్ రెడ్డి, ప్రియాంక ప్రవీణ్, శివకేసరి బాబు, మల్లేశం తదితరులు ఉన్నారు.

●**మెట్‌పల్లి రూరల్:** జగ్గసాగర్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ పుల్ల జగన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులను అందచేశారు.

●**రాయికల్:** పట్టణంలో బీఆర్ఎస్ మండల, పట్టణ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో మండల, పట్టణ అధ్యక్షులు బర్కం మల్లేష్, ఎలిగేటి అనిల్ కుమార్, మండల, పట్టణ కో ఆర్డినేటర్ తురగ శ్రీధర్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్‌లు ఉదయశ్రీ పాల్గొన్నారు.

●అల్లీపూర్ నిర్వహించిన కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బర్కం మల్లేష్, పీఏసీఎస్ చైర్మన్ రాజలింగం, మాజీ ఎంపీటీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

●**సారంగాపూర్:** దుబ్బరాజన్న సన్నిధిలో కవిత జన్మదిన వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు తేలు రాజు, మాజీ సహకార సంఘం అధ్యక్షులు సాగి సత్యంరావు పాల్గొన్నారు.

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మాజీ జడ్పీటీసీ రమణ, బీఆర్ఎస్ బీర్‌పూర్ మండల నేరెల్ల సుమన్, బీర్‌పూర్ సింగిల్‌విండో ఉపాధ్యక్షులు ఊరడి కొమురెల్లి, బీర్‌పూర్ గ్రామశాఖ అధ్యక్షులు రామచంద్రం పాల్గొన్నారు.

వైభవంగా బోనాల పండుగ



జగ్గసాగర్‌లో బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి బయలు దేరిన భక్తులు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గసాగర్ గ్రామ దేవతల పునఃప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా బోనాల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని నల్లపోచమ్మ ఆలయాన్ని పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం నుంచి మండలంలోని ఆయా గ్రామాల్లోని భక్తులు గ్రామ దేవతలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి ఒడి బియ్యం పోసి కానుకలు సమర్పించుకున్నారు. మహిళలు, భక్తులు ఉపవాస దీక్షలతో బోనం కుండలను అలంకరించి నైవేద్యాన్ని తయారు చేశారు. 1116 మంది మహిళ భక్తులు బోనమును నెత్తిన ఎత్తుకుని డప్పుచప్పులతో ఆలయానికి బయలు దేరారు. భక్తులు బోనాలతో ఆలయం చుట్టు ప్రదిక్షణాలు అమ్మ వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈర్నపల్లి ప్రశాంత్, నాయకులు పుల్ల జగన్‌గౌడ్, డాకురి వెంకటేష్, కొమ్ముల రాజుపాల్ రెడ్డి, ముద్దాం నర్సింహులు, పిడుగు తిరుపతిరెడ్డి, బోగ గంగాధర్‌లు పాల్గొన్నారు.

స్కూల్ బస్ ఢీకొని వృద్ధుడి మృతి

కథలాపూర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం పోసానిపేటలో స్కూల్ బస్సు ఢీకొని మొగుళ్ళ ఎర్రయ్య (70) అనే వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం ఎర్రన్న గ్రామంలో తన పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో ఎస్ఎఫ్ఎస్ పాఠశాలకు చెందిన బస్సు రివర్స్‌లో వచ్చి వెనక వైపు నుంచి ఢీకొట్టింది. చేతిపై నుంచి టైర్ వెళ్ళడంతో పూర్తిగా పగిలిపోయింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ఎర్రన్న మృతి చెందాడు. మృతుడి కొడుకు గంగమల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. మృతదేహానికి కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

● సంక్షిప్తం..

●కథలాపూర్: హెచ్ఐవీ పరీక్షల కోసం గతంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)లను సంపూర్ణ సురక్షా కేంద్రాలు (ఎస్ఎస్‌కె)గా మార్చిన నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి వైద్యుడు వినోద్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు.

●దళితబంధు సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోగిల మహేశ్‌ను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని మండల దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు తీట్ల శంకర్ పేర్కొన్నారు.

●మెట్‌పల్లి: మెట్‌పల్లి కోర్టులో అసిస్టెంట్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన చర్లపల్లి ఆనంద్ గౌడ్‌ను గురువారం గౌడ సంఘ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో పట్టణ గీత పారిశ్రామిక సంఘ అధ్యక్షుడు పూదారి సుధాకర్ గౌడ్, సర్వాయి పాపన్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామాగౌడ్ పాల్గొన్నారు.

●కొడిమ్యాల:నాచుపల్లి జేఎన్‌టీయూలో బీటెక్ బయోటెక్నాలోజీ కోర్సు 2025-2026 విద్యా సంవత్సరంలో ప్రారంభించాలని జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ కిషన్ కుమార్‌రెడ్డికి ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ సమక్షంలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు.